క్లుప్తంగా

రేపు గంగాదేవి తిరునాళ్ల వేలం

క్రోసూరు: క్రోసూరులోని వీరభద్ర, మల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 6న ఉదయం 11 గంటలకు అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవి పేరంటాళ్లమ్మ తిరునాళ్లకు సంబంధించిన హక్కుల వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఎం.కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ తిరునాళ్ల పురస్కరించుకుని వేలం ఈ నెల 11వ తేదీన నుంచి అదేవిధంగా 15వ తేదీ మార్చి నెల పొంగళ్లకు సంబంధించి వివిధ రకాల హక్కుల కొరకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున దేవదాయ శాఖ షరుతులకు లోబడి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం ఇప్పటికీ రెండు సార్లు వాయిదా పడటంతో తిరిగి మూడవ సారి నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

రీ సర్వే ప్రక్రియ పరిశీలన



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మేర సర్వే పూర్తయిందో రికార్డులు పరిశీలించారు. సర్వే జరిగే భూమికి సంబంధించి సంబంధిత భూ యజమానికి ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. ఆర్ఎస్ఆర్‌లో ఉన్న వివరాలు, భూ యజమాని వద్ద ఉన్న వివరాలు సరిచూసుకోవాలన్నారు. అంతకుముందు గ్రామంలో జరుగుతున్న నిత్యావసర సరుకుల పంపిణీ ప్రక్రియని తహసీల్దార్ పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టీ సుధాకర్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రావతి సమేత భావనారుషి కల్యాణం



పెదకూరపాడు: రథసప్తమి పురస్కరించుకొని పెదకూరపాడు భద్రావతి సమేత భావనారుషి దేవాలయంలో స్వామి వార్లకు కల్యాణ మహోత్సవం మంగళవారం జరిగింది. ఆలయ అర్చకులు నుదురుపాటి హనుమంతరావు శర్మ, హరినాథ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, కల్యాణం జరిపించారు. ముందుగా కలశ స్థాపన, గౌరీ పూజ, పంచామృతాభిషేకాలు అనంతరం భావనారుషిస్వామి వార్ల కల్యాణం మేళ తాళాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత




సత్తెనపల్లి: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లి, తాత చెంతకు చేర్చిన ఘటన మంగళవారం జరిగింది. సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రంగా కాలనీకి చెందిన అంగులూరి కోటేశ్వరరావు అలియాస్ సత్తి సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో ఏడు సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నపిల్లవాడు తిరుగుతూ ఉండటంతో గమనించిన స్థానికులు మంగళవారం ఉదయం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు అప్పగించారు. తీరా వివరాలు సేకరించగా పట్టణంలోని రంగాకాలనీకి చెందిన మతిస్థిమితం లేని బాబుగా గుర్తించారు. బాబు తండ్రి గోపి మృతి చెందాడన్నారు. ఐసీడీఎస్ అధికారుల ద్వారా తల్లి అంగులూరి కోటేశ్వరమ్మ, తాతయ్య రామిశెట్టి వెంకటేశ్వరరావులకు కోటేశ్వరరావును క్షేమంగా అప్పగించడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి శ్రీచక్ర పూజ

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి బొడ్రాయి సెంటర్‌లో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలు యెల్లినేడి లక్ష్మీతులసి గృహం వద్ద మంగళవారం అమ్మవారి శ్రీచక్ర పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, గోగినేని కోటేశ్వరరావు, యెల్లినేడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



అభివృద్ధికి నోచుకోని చారిత్రక చెరువు



క్రోసూరు చెరువు

- గతంలో విస్తీర్ణం సుమారు 700 ఎకరాలు
- ప్రస్తుతం 500 ఎకరాలు
- సాగు, తాగునీరు, చేపల పెంపకానికి ఆధారం

క్రోసూరు: రాజులకాలం నాటిదిగా చెప్పుకునే అతిపురాతనమైన క్రోసూరు చెరువు సుమారు 700 ఎకరాలు విస్తీర్ణం గల అతి పెద్ద సామాజిక చెరువు. 25 సంవత్సరాల క్రితం కొంత మేర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించగా ప్రస్తుతం 500 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. క్రోసూరు చెరువు కింద సుమారు 300 ఎకరాలలో వరి సాగు, చెరువులో ఉన్న బావి ద్వారా తాగునీటి అవసరాలు, చేపల సొసైటీ ద్వారా చేపల పెంపకంతో అనేక మంది ప్రజలకు ఈ చెరువు జీవనాధారమైంది. అలాంటి ఈ చెరువు అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురవుతుంది. క్రోసూరు చెరువు నాగార్జునసాగర్ కెనాల్స్‌లోని మైనర్ ఇరిగేషన్ శాఖ కింద ఉండటంతో శాఖ ద్వారా చెరువుకు నీళ్లు పెట్టటం, మరమ్మతులు చేయటం జరుగుతుంటుంది. గత ఏడాది 2024 అక్టోబర్‌లో ఏకధాటిగా కురిసిన వర్షాలకు చెరువు గట్టు తెగిపోవటం జరిగింది. చెరువుగట్టు తెగటంతో చెరువులోని చేపలు కూడా బయటకు వస్తుండటంతో ప్రజలు చేపలు పట్టుకోవటానికి ఎగబడటం జరిగింది. క్రోసూరు గ్రామానికి భూగర్భ జాలలు తగ్గకుండా, నీటి ఎద్దడి రాకుండా ఈ చెరువు కాపాడుతుంది.

ఆదాయ మార్గాలు ఇలా...

చెరువు ద్వారా క్రోసూరు పంచాయతీకి పెద్దగా ఆదాయం సమకూరటం లేదు. కేవలం చేపల సొసైటీ ద్వారా వచ్చే కొద్ది మాత్రం ఆదాయం మినహా పెద్దగా రావటం లేదు. సాగుపై వచ్చే శిస్తు పన్ను రెవెన్యూ శాఖకు వెళుతుంది. అయితే ఈ చెరువును అభివృద్ధి పరిస్తే పంచాయతీకి మరింత ఆదాయం సమకూరుతుందని స్థానికులు తెలుపుతున్నారు.

■ గతంలో నిర్మించిన చెరువుగట్టు (రింగ్‌బండ్) ఈ చివరి నుంచి ఆ చివర వరకు సుమారు 2 కి.మీ. మేర ఉండే గట్టు అభివృద్ధి పరచగలిగితే ఆదాయం వస్తుంది. క్రోసూరు చెరువు గట్టును ట్రాఫిక్ బైపాస్ చేసేందుకు, ప్రజలు వాకింగ్ కొరకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయటం, చెట్లునాటి సుందరంగా తీర్చిదిద్దటం, చెరువులో బోట్ షికారు లాంటివి, ఏర్పాటు చేస్తే క్రోసూరును అందమైన పట్టణంగా మార్చటమేకాక, పంచాయతీకి ఆదాయ వనరులు ఏర్పడతాయని ప్రజలంటున్నారు.

ఆచరణకు నోచుకోని తీర్మానం

క్రోసూరు చెరువును రెండుగా చేయాలని గతంలో పంచాయతీ తీర్మానం చేసినప్పటికీ ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. క్రోసూరు చెరువును రెండుగా చేసి ఒకటి తాగునీటికి, మరొకటి సాగుకు, చేపలకు వినియోగించేలా తీర్మానం చేసినప్పటికీ ఇప్పటికీ ఆచరణలోకి రాలేదు.

■ క్రోసూరు కొండపై వెలిసిన అతిపురాతన, చరిత్రాత్మక స్వయంభూ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఎదురుగా ఈ చెరువు ఉండటం, చెరువు గట్టు పక్కగా నూతనంగా సిద్ధమవుతున్న అభయాంజనేయస్వామి విగ్రహం ద్వారా ఆధ్యాత్మికతకు ఎంతగానో తోడ్పడుతుంది. ప్రజా ప్రతినిధులు చొరవ చూపి తగు నిధులు కేటాయిస్తే క్రోసూరు చెరువును అందమైన, జీవకళ, ఆధ్యాత్మిక చెరువుగా తీర్చిదిద్దవచ్చునని క్రోసూరు ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు



గ్రామోత్సవంలో కోలాట ప్రదర్శన

సత్తెనపల్లి: రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని పట్టణంలోని 20, 24వ వార్డు కొత్తపేట, భావనారుషి నగర్, పాతసాలిపేటలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రావతీ సమేత భావనారుషిస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని వీక్షించారు. పూజలకు స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. సాయంత్రం గామొత్సవం నిర్వహించారు. కత్తి వేషాలు, జానపద కళారూపాలు చిత్ర, విచిత్ర వేషాలు, కనక తప్పెట్లు, మిరుమిట్లు గొలిపే లైటింగ్, బాణసంచా కాల్పులతో స్వామి వారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 5న సాయంత్రం 4 గంటలకు స్వామి వారికి మహిళలు హారతులు అందించనున్నారు. భక్తులకు ఆటంకం కలగకుండా పద్మశాలీయ బహుత్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎండ్రాయిలో రథసప్తమి పూజలు

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గంగా పార్వతీ సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానంలో రథసప్తమి సందర్భంగా మంగళవారం సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీగీతా వెంకటేశ్వర కృష్ణ యజుస్మార్త ఆగమ పాఠశాల ఆధ్వర్యంలో మాఘశుద్ధ సప్తమీ ధనిష్ట నక్షత్రకాలంలో వేద పాఠశాల విద్యార్థులు సామూహికంగా సౌరజపం, అరుణపారాయణం నిర్వహించారు. అనంతరం ఏకాంబరేశ్వరునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సూర్యనారాయణస్వామికి త్రిచ, అరుణ, సౌర మంత్రాలతో సూర్య నమస్కారాలు చేశారు. నిర్వాహకుడు ఘంటసాల చంద్రమౌళిశర్మ రథసప్తమి సందర్భంగా ఆరోగ్య కారకుడైన సూర్యభగవానుని అనుగ్రహం కొరకు సౌరహోమం నిర్వహించామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై సూర్యభగవానునికి పూజలు నిర్వహించారు. అలాగే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని సూర్యదేవాలయంలో రథసప్తమి సందర్భంగా సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సూర్యభగవానుడికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేషాలంకరణ, సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కొత్తపేటలోని పూజల్లో భక్తులు

మందకృష్ణమాదిగకు పద్మశ్రీపై ఎమ్మార్పీఎస్ హర్షం

అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇవ్వటం పట్ల మండల ఎమ్మార్పీఎస్ శాఖ హర్షం వ్యక్త పరిచింది. మంగళవారం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హలో మాదిగ-చలో హైదరాబాద్, లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరు డప్పులతో రావాలని పిలుపునివ్వడం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొడవటి కృపారావు మాదిగ, నాయకులు నందిగం దేవదాసు మాదిగ, మరియదాసు మాదిగ, పేతురు మాదిగ, ప్రకాష్‌రావుమాదిగ, జైరావుమాదిగ, ధర్మేంద్ర మాదిగ, లక్ష్మిమాదిగ, అనిత మాదిగ, రత్న మాదిగ, మరియమ్మ మాదిగ, మాధవి మాదిగ, మంగమ్మ మాదిగ పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఘనంగా ఎస్టీయూ నేత ముగ్ధం మొహిద్దీన్ జయంతి



సత్తెనపల్లి: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎస్టీయు నేత ముగ్ధం మొహిద్దీన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని మాట్లాడుతూ ముగ్ధం మొహిద్దీన్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిర్మాణం చేశారన్నారు. నిజాం ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, ఉపాధ్యాయుల హక్కులను కాపాడటంలో ఉన్నత పాత్ర వహించారన్నారు. మొహిద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎస్ఎం రహమాన్, మండల ప్రధాన కార్యదర్శి ఎం అప్పారావు, ఆర్థిక కార్యదర్శి పి.వెంకయ్య, జిల్లా నాయకులు కె.సురేష్, పి.నాగరాజు, కె.భాగ్యలక్ష్మి, ఆజీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ నెల 15 నుంచి వర్మీ కంపోస్టు తయారీ ప్రారంభించాలి

నకరికల్లు: చెత్త నుంచి సంపద తయారు చేసే ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్ సూచించారు. మండలంలోని దేచవరం, రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను మంగళవారం పరిశీలించి మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి అన్ని గ్రామాల్లోని షెడ్లలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో చెత్తకుప్పలు కనిపిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడంతో పాటు రైతులకు తక్కువ ధరలో సేంద్రియ ఎరువును అందించేందుకు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు దోహదపడాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు దుర్గారావు, అబ్దుల్లా, గ్రీస్ అంబాసిడర్‌లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలదాసు ఆరాధన మహోత్సవం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శెట్టిపల్లి బాలదాసు ఆరాధన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది రథసప్తమి రోజున ఆరాధన మహోత్సవం నిర్వహిస్తారు. బాలదాసు మఠంలో రామనామ ఏకాహం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం బాలదాసు చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సూర్యనమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: లోకానికి వెలుగులు ప్రసాదించే సూర్య భగవానునికి హైందవ పురాణేతిహాసాల్లో సముచిత స్థానం ఉందని, నిత్యం సూర్య నమస్కారాలు చేస్తే మనోఫలసిద్ధి కలిగి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సరస్వతి శిశుమందిర్ ప్రాథమిక పాఠశాల కార్యదర్శి ఎంఎస్‌వీ నాగరాజు అన్నారు. పట్టణంలోని వావిలాల వీధిలోని సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సూర్యకిరణాల్లో దాగి ఉండే 'డీ' విటమిన్ వల్ల మనిషికి ఎంతో మేలు కలుగుతుందని, ఆ కారణంతోనే పసికందులను ఉదయాన్నే కొంతసేపు ఎండలో ఉంచుతారన్నారు. సూర్య నమస్కారాలు చేస్తూ ఆసనాలు వేయడం వల్ల శారీరక బలం చేకూరుతుందన్నారు. ముందుగా ఆర్ఎస్ఎస్ సంఘ కార్యకర్త ఆకుల అమరవెంకట శ్రీనివాసరావు విద్యార్థుల చేత సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు విప్పర్ల సాంబశివరావు, గోరెడ్ల సాంబశివరావు, ప్రధానాచార్యులు పి.బ్రహ్మచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండపి చెరువులో చేపలు పట్టుబడి నిషేధం



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి మైనర్ ఇరిగేషన్ చెరువులో చేపలను ఎవరూ పట్టకూడదని, ఎవరైనా అతిక్రమించిన ఎడల చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని మత్స్య శాఖ గ్రామ అసిస్టెంట్ పావని తెలిపారు. ఆ మేరకు తొండపి మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ వద్ద హెచ్చరిక బోర్డును మంగళవారం ఏర్పాటు చేశారు. 2024-25 సంవత్సరానికి గాను చేపల పెంపకం కోసం ఎవరికీ లీజుకి ఇవ్వటం జరగలేదన్నారు. మత్స్య శాఖ ఆదేశాల మేరకు నిబంధనలు అతిక్రమించకూడదని చెప్పారు. చేపల పెంపకానికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయటం జరుగుతుందన్నారు.

మృతి చెందిన ఏఎన్ఎం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

రాజుపాలెం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఎన్ఎం కోటిలింగమ్మ కుటుంబ సభ్యులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. కోటిలింగమ్మ కాంట్రాక్ట్ ఏఎన్ఎంగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో స్పందించిన ఆరోగ్య సిబ్బంది పిల్లల చదువుల నిమిత్తం రూ.75 వేల యూనియన్ బ్యాంక్ ఫిక్స్‌డ్ బాండ్‌ను కుమారులకు డాక్టర్ వెంకటకృష్ణకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావులు, సిబ్బంది కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సత్తనపల్లి: మద్యం తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండు రోజులు క్రితం గ్రామానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి గ్రామంలో మద్యం తాగుతూ ఉన్నాడు. నాసిరకం మద్యం తాగి మృతి చెందాడా? లేక అతిగా మద్యం తాగి ఆహారం, నీళ్లు తీసుకోక మృతి చెందాడా? అనేది తెలియాల్సి ఉంది. స్థానికుల సమాచారం మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు.

వరిలో ఉల్లికోడు నివారణకు చర్యలు



వరి పొలాలు పరిశీలిస్తున్న జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ సతీష్, ఏవో దేవదాసు

నకరికల్లు: రబీలో సాగు చేస్తున్న వరిపైరులో ఉల్లికోడు అధికంగా కన్పిస్తుందని సత్వరమే అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ ఎం.సతీష్ సూచించారు. మండలంలోని చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లోను సాగులో ఉన్న వరి పంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైరు పిలక దశలో ఐదు శాతం ఉల్లికోడు గొట్టాలు లేదా దుబ్బుకి ఒక్క కోడు సోకినట్లైతే వెంటనే నివారించాలని అన్నారు. కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున వేయాలన్నారు. క్లోరోఫైరీఫాస్ 20 ఈసీ మందును 500 ఎంఎల్ లేదా క్లోరంత్రనీలిప్రోల్ 20 ఎస్‌సీ మందును 80 ఎంఎల్ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏవో కె.దేవదాసు మాట్లాడుతూ రబీలో ఈ పంట నమోదు చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ కైవేసీ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, వ్యవసాయ సహాయకులు జి.జగదీష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

దమ్ములోనే భాస్వరం ఎరువులు వాడాలి

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెం సమీపంలోని వరి పొలాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య రైతులతో మాట్లాడి నాటు వేసే ముందుగా దమ్ములోనే భాస్వరం ఎరువులను వాడాలని, పై పాటుగా వాడకూడదని తెలిపారు. నత్రజని కాంప్లెక్స్ ఎరువులను, యూరియానుగానీ వాడవచ్చని తెలిపారు. నత్రజనిని మూడు భాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ములోను, అంకురం దశలోను, బురద పనుల్లో మాత్రమే సమానంగా వెదజల్లాలని తెలిపారు. పొటాష్ ఎరువులను దమ్ములో సగభాగం, అంకురం ఏర్పడే దశలో మిగిలిన సగభాగం వేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నార్నెపాడులో పొలం పిలుస్తోంది

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు నివారణకు పై పాటుగా కొరాజెన్ 60 ఎం.ఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంటపై వేసిన ఎరువు మొక్కకు అందించే వీఏఎం, కేఎస్‌బీ, పీఎస్‌బీ వంటి వాటిని వాడాలని సూచించారు. మొక్కజొన్న, శనగ వేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ అరుణ



చౌటపాపాయపాలెంలో పొలం పిలుస్తోంది

పంప్‌హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన

క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామం వద్ద జరుగుతున్న గోదావరి పెన్నా అనుసంధాన పనుల్లో భాగంగా పంప్‌హౌస్-3 ఏర్పాటు చేసేందుకు కావాల్సిన స్థలం సేకరించటానికి ఏర్పాటు చేసిన కమిటీతో తహసీల్దార్ వెంకటనాగరాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ వివరిస్తూ 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు కరువు నివారణ ప్రాజెక్ట్ పనులలో భాగంగా పీసపాడు వద్ద పంప్‌హౌస్ పనులు చేపట్టారన్నారు. ఆ తరువాత కాలంలో పనులు ముందుకు సాగలేదన్నారు. మూడవ పంప్‌హౌస్ నిర్మాణానికి రైతుల నుంచి భూములు సేకరించేందుకు కావాల్సిన వివరాలతో విచారించేందుకు కమిటీ వేసినట్లు చెప్పారు. ఆ కమిటీలో తహసీల్దార్‌తోపాటు మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు ఉంటారన్నారు. పంప్‌హౌస్ ఏర్పాటుకు కావాల్సిన భూమి సేకరించేందుకు ఆ ప్రాంతంలోని రైతుల పేర్లు, విస్తీర్ణం, నమోదు చేసుకుని గ్రామ సభ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపించిన తరువాత పనులకు సంబంధించిన ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు చేపడతారని తెలిపారు. అందుకోసం క్షేత్రస్థాయిలో మంగళవారం పంప్‌హౌస్‌కు కావాల్సిన భూమి పరిశీలించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, మండల సర్వేయర్ శ్రీధర్, వీఆర్వో ఇబ్రహీం, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకట నాగరాజు, రెవెన్యూ అధికారులు

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్

క్రోసూరు: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను పారదోలవచ్చునని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రవీంద్ర రత్నాకర్ అన్నారు. మంగళవారం ఆశా డే కార్యక్రమం పురస్కరించుకొని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. దోమలను లార్వా దశలోనే నశింపజేయాలన్నారు. అనంతరం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ధనుష్, మహమ్మద్ షాద్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, సీహెచ్ఓ సాంబశివరావు, హెచ్ఎస్ శివుడు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇరువురికి తీవ్రగాయాలు

నకరికల్లు: రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి వేగంగా ఢీ కొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని శాంతినగర్ వద్ద మంగళవారం జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం నరసరావుపేట నుంచి దేచవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రభాకర్ శాంతినగర్ గ్రామం వద్ద పెట్రోల్ బంకులోకి వెళ్లేందుకు వాహనాన్ని కుడి పక్కకు తిప్పాడు. వెనుక నుంచి అటువైపే వస్తున్న దేచవరం గ్రామానికి చెందిన నాలి శివ ద్విచక్ర వాహనంతో ఢీ కొన్నాడు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై ఇరువైపులా పడిపోయారు. పల్నాడు జిల్లా ఎస్పీని కలిసేందుకు నరసరావుపేట వెళ్తున్న పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు, దాచేపల్లి సీఐ భాస్కర్‌లు మార్గం మధ్యలో శాంతినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం చూసి గాయాలతో పడున్న క్షతగ్రాతులను 108 వాహనం వచ్చేందుకు సమయం పట్టడంతో అటుగా వెళ్తున్న ఆటోలో హుటాహుటిన నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించారు. సకాలంలో స్పందించి సేవా తత్పరతను, సమాజం పట్ల బాధ్యతను సీఐలు చాటుకున్నారు.



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న పిడుగురాళ్ల, దాచేపల్లి సీఐలు వెంకట్రావు, భాస్కర్‌లు